థ్యాంక్యూ సార్!



ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించినందుకు మంగళవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి.

క్లుప్తంగా

108 పైలెట్స్, ఈఎంటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వనస్థలిపురం: ఈఎంఆర్ఐ (108) సంస్థలో పైలెట్స్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ షాహిద్, జిల్లా మేనేజర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 23, 24 తేదీల్లో హయత్‌నగర్‌లోని 108 కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పైలెట్ పోస్టుకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు బ్యాడ్జ్ డ్రైవింగ్ లేదా హెవీ లైసెన్స్‌తో 2 సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం, ఈఎంటీ పోస్టుకు బీఎస్సీ (బీజెడ్‌సీ), లేదా ఏదైనా లైఫ్ సైన్స్ గ్రూప్, బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9154248818 లలో సంప్రదించాలని వారు కోరారు.

గుడిసెవాసులకు ఆర్థిక సాయం

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి రెండు గుడిసెలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మంగళవారం గుడిసెవాసులను పరామర్శించారు. ఆహార పదార్థాలు, దుస్తులు, పిల్లల పుస్తకాలు పూర్తిగా కాలిపోవడంతో సామ రంగారెడ్డి వారికి తక్షణ అవసరాల కోసం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రవెల్లి సత్యనారాయణ, గంగం శ్రీను పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు మైనంపల్లి క్షమాపణ చెప్పాలి

మలక్‌పేట: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుపై మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలను హరీశ్ అన్న సేన రాష్ట్ర నాయకుడు పూజల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. మలక్‌పేటలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మైనంపల్లి నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పాత మెదక్ జిల్లా సిద్దిపేటవాసులకు నువ్వేంటో తెలుసు.. హరీశ్ రావు ఏంటో తెలుసునని, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. మెదక్ టికెట్ తన కొడుకు రోహిత్‌కు దక్కలేదని ఇష్టానుసారంగా మాట్లాడిన హరీశ్‌రావుకు మైనంపల్లి తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

క్యాబ్ డ్రైవర్ అదృశ్యం

సైదాబాద్: ఉద్యోగానికి అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన క్యాబ్‌డ్రైవర్ కనిపించకుండా పోయాడు. సైదాబాద్ పోలీసుల కథనం ప్రకారం..జయానగర్ కాలనీలో నివసించే డి.మన్మథకుమార్ గౌడ్ (39) సదర్‌ల్యాండ్ మణికొండ యూరో వెండర్ కంపెనీలో క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు విధులకు వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి తన ద్విచక్రవాహనం (టీఎస్11ఈకే 2346)పై వెళ్లాడు. అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాప్ వచ్చింది. బంధు,మిత్రులను వాకబు చేసినా మన్మథ కుమార్ ఆచూకీ తెలియరాలేదు. దాంతో అతని తండ్రి అంజయ్యగౌడ్ సోమవారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్యపురిలో బీఆర్ఎస్ సంబురాలు



చైతన్యపురి: ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన జాబితాలో ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి తిరిగి సీటు కేటాయించడంపై చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. చైతన్యపురి చౌరస్తాలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు లింగాల రాహుల్‌గౌడ్, నర్సిరెడ్డి, మహేష్‌గౌడ్, కడియం మోహన్, మోహన్‌రాజు విశ్వప్రేమ్, నరేందర్‌రెడ్డి, కృష్ణ, జలందర్, కిషన్, సంతోష్ యాదవ్, పులికిరణ్ పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన.. పడకేసిన పారిశుద్ధ్యం

- రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్వాసనతో స్థానికులకు ఇబ్బందులు



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మహిళా థీమ్ పార్క్ పక్కన పేరుకపోయిన చెత్త

ఎల్బీనగర్: తమను పర్మనెంట్ చేయాలంటూ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన కారణంగా ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో పలుచోట్ల చెత్త పేరుకుపోవడంతో పాటు రోడ్లపై దుమ్ముతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదు రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని విధులను బహిష్కరించి ఉదయం నుంచీ మూడు సర్కిళ్ల కార్యాలయం ఆవరణలో బైఠాయిస్తున్నారు. దీంతో కాలనీల్లో పారిశుద్ధ్య పనులు పడకేసి కాలనీల్లో, ప్రధాన రహదారులలో చెత్త పేరుకుపోయి దుర్గంధభరితంగా మారడంతో అటుగా వెళ్లాలంటే దుర్వాసనతో కాలనీ వాసులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు కాలనీ రోడ్లపూ దుమ్ము, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ప్రయాణికులను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. పలు కాలనీలలో రోడ్లపై ఇసుక పేరుకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాత్రం తమ డిమాండ్లకు ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

ఎల్బీనగర్‌లో కాషాయ జెండా ఎగురవేయాలి

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్సీ రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్

వనస్థలిపురం: ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగుర వేయాలంటే బూత్ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ పార్టీకి సమయమిచ్చి పనిచేయాలని బీజేపీ కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ రవికుమార్ అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో నిర్వహించిన ఎమ్మెల్యే ప్రవాస్ వర్క్‌షాపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని సమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై నాయకులతో చర్చించి, సరళ నమో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విధాన సభ, డివిజన్ స్థాయిలో సోషల్ మీడియా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ టీమ్ యొక్క పనితీరుపై సమీక్షించారు. శక్తి కేంద్ర పోలింగ్ బూత్ అధ్యక్షులతో రాజకీయ పరిస్థితులు, వ్యూహాలపై చర్చించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, టి.విజయ్‌కుమార్, అంజన్‌కుమార్‌గౌడ్, అశోక్‌కుమార్, కృష్ణవేణి, చిన్నయాదవ్, భార్గవ్, రేవతి, చైతన్య పాల్గొన్నారు.

మలక్‌పేట ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి: అజిత్‌రెడ్డి



అజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న శాలివాహన వాకర్స్ క్లబ్ సభ్యులు

మలక్‌పేట: ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి తనకు అవకాశం కల్పించారని, మలక్‌పేట ప్రజలు ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని తీగల అజిత్‌రెడ్డి కోరారు. మంగళవారం మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డితో కలిసి మూసారంబాగ్ శాలివాహన వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా వాకర్స్ ఆయన్ను సన్మానించారు. అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. రాష్ట్రం ఇంకా ప్రగతి పథంలో కొనసాగడానికి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు చక్రపాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, రాజేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, లక్ష్మారెడ్డి, సత్యనారాయణయాదవ్, గంగాధర్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు గౌర శశిధర్‌రావు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి రహిత ఎల్బీనగర్ బీజేపీ ధ్యేయం



బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

మన్సూరాబాద్: డ్రగ్స్, గంజాయి, బెల్టుషాపుల రహిత ఎల్బీనగర్ కోసం బీజేపీ పోరాటం చేస్తోందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తెలిపారు. మత్తు పదార్థాలు, బెల్టు షాపులకు వ్యతిరేకంగా బుధవారం ఉదయం ఎల్బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఎల్బీనగర్ చంద్రపురికాలనీలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం రంగారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, బాలికపై 8 గంటల పాటు అఘాయిత్యం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో గంజాయి, డ్రగ్స్, బెల్టుషాపులు విపరీతంగా ఉన్నాయని, యువత డ్రగ్స్, గంజాయి సేవించి పెడమార్గాన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందనవనం బస్తీ స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో సంఘ విద్రోహశక్తులకు అడ్డాగా మారిందని ఆరోపించారు. బాలికకు న్యాయం చేసేంతవరకు బీజేపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. బుధవారం ఎల్బీనగర్‌లో జరిగే నిరసన కార్యక్రమానికి బీజేపీ నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, బద్దంప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయకులు చింతల సురేందర్‌యాదవ్, విజయ్‌కుమార్, గంగదాసు కృష్ణారెడ్డి, కృష్ణంరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

నాగోలు: ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని భాష్యం బ్లూమ్స్ స్కూల్ తెలంగాణ సీఈఓ చైతన్య అన్నారు. బండ్లగూడ ఫతుల్లాగూడలోని భాష్యం బ్లూమ్స్ పాఠశాలలో మంగళవారం సంజీవని ఫౌండేషన్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాఠశాల సీఈఓ చైతన్య, ప్రముఖ డాక్టర్ ఉషశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ బాబూరావు, పాఠశాల అకాడమిక్ డీన్ అర్చన, ప్రిన్సిపాల్ మహతి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 30, వంకాయ 28, బెండ 23, పచ్చి మిర్చి 45, కాకర 38, బీర 23, క్యాబేజీ 19, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 37, దొండ 18-35, చిక్కుడు 50, గోకర 28, బీట్‌రూట్ 23.

సీఎంను కలిసిన బీసీ సంఘం నేత యాదగిరి

చంపాపేట: చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీకి చెందిన రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి కొండ యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం ప్రగతి భవన్‌కు తరలివెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ, త్వరలో జరగబోయే శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పూర్తిస్థాయిలో తాము మద్దతు ఇస్తామని సీఎంకు హామీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శివయాదవ్, చందు యాదవ్, శ్రీనివాస్‌కుర్మ, కొండలు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్‌తో కొండ యాదగిరి

మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్యం

దిల్‌సుఖ్‌నగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం రాత్రి ఆర్‌కేపురం డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో డివిజన్ శక్తి కేంద్ర ఇన్‌చార్జి, బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుదర్శన్ రెడ్డి, కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన అజిత్‌రెడ్డి



హోంశాఖ మంత్రితో తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి మంగళవారం హోంశాఖ మంత్రి మహమూద్ అలీని నగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా హోంమంత్రిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. హోంశాఖమంత్రి ఆయన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, మూసారంబాగ్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌర శశిధర్‌రావు హోంమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

సుధీర్‌రెడ్డికి నాగోలు నేతల శుభాకాంక్షలు



సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెల్పుతున్న చెర్కు సంగీత, చిరంజీవి

నాగోలు: ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మరోసారి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన సందర్భంగా మంగళవారం నాగోలు డివిజన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ చెర్కు సంగీత ప్రశాంత్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పటి చిరంజీవి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. బీఆర్ఎస్ నాయకులు కాటేపాక రవి, చెర్కు జంగయ్యగౌడ్, పల్లె సీతారాములుగౌడ్, తూర్పాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఘనంగా బోనాలు



బోనాల ఉత్సవాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది

చంచల్‌గూడ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి బోనం తయారు చేసి అమ్మవారి ఆలయంలో సమర్పించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉత్సవాలు నిర్వహించామని ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జోష్నప్రభ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వైశాలి, నీలవేణి, శైలజ, ఎల్జిబెత్ రాణి, ఉమాదేవి పాల్గొన్నారు.

న్యూగడ్డిఅన్నారం కాలనీ నూతన కమిటీ ఎన్నిక

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌లోని న్యూగడ్డిఅన్నారం కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారులు ప్రసాద్‌రెడ్డి, అర్జున్‌రావు మంగళవారం ప్రకటించారు. ఈనెల 13న ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా జి.రఘు, ఉపాధ్యక్షులుగా ఆర్. వెంకటరత్నం, డి. ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటప్రసాద్, కోశాధికారిగా బాలాజీ, జాయింట్ సెక్రటరీలుగా సంజయ్ గులాటి, ఆంజనేయులు, ఈసీ మెంబర్లుగా లక్ష్మీకాంత్, బి.శ్రీనివాస్, ఎ.కిషోర్, శ్రీనికేష్, సంతోష్‌రెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందని నూతన అధ్యక్షుడు రఘు తెలిపారు.



అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయండి: ఎమ్మెల్యే



అభివృద్ధి పనులపై సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు .బాక్స్ డ్రెయిన్, వరద నీటి కాలువలు, ఇతర అభివృద్ధి పనులపై మంగళవారం ఎమ్మెల్యే తన నివాసంలో అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనుల ఆలస్యంపై వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో కాంట్రాక్టర్లకు బిల్స్ ఆలస్యంగా వచ్చేవని, ఇప్పుడు వెంట వెంటనే వస్తున్నాయన్నారు. ఇంకా ఎవరికైనా బిల్స్ రాకపోతే వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్లు అధికంగా సిబ్బందిని నియమించి పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు.వరద నీటి కాలువలు పూర్తయితే నియోజకవర్గంలో ఎక్కడా కూడా ఒక్క కాలనీ కూడా నీట మునిగే అవకాశమే ఉండదన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేసి పనులలో జాప్యం జరగాకుండా త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈలు రఫీ, కనకయ్య, ఏఈలు హేమ, సురేష్, విజయ్, ప్రజ్ఞ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే తరచూ ప్రమాదాలు



ఎలాంటి రక్షణ చర్యలు లేని లిఫ్ట్ గుంత

మన్సూరాబాద్: టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే తరచూ ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని జీహెచ్ఎంసీలో బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి మండిపడ్డారు. లిఫ్ట్ గంతలో పడి బాలుడు మృతి చెందిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, సోమవారం రాత్రి ప్రమాదం జరిగితే మున్సిపల్ అధికారులు మంగళవారం మధ్యాహ్నం ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట అని అన్నారు. బిల్డర్ రామకృష్ణ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకోవటంతో ఆడుకుంటున్న బాలుడు మృతి చెందాడని, సదరు బిల్డర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

బిల్డర్‌పై కేసు నమోదుకు చర్యలు...

లక్ష్మీభవానీ నగర్‌లోని ఘటనా స్థలాన్ని మంగళవారం హయత్ నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మన్సూర్, ఉమ పరిశీలించారు. బిల్డర్ రామకృష్ణ లిఫ్ట్ గుంతకు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదని, అతడిపై హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు

బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు

లింగోజిగూడ: నిత్యం ప్రజల్లో ఉంటూ వారి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ప్రతి పక్షాలు తమ ఉనికిని చాటుకునేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు ఆరోపించారు.ఎల్బీనగర్‌లో ఇప్పటి వరకు రూ.3202 కోట్ల అభివృద్ధి జరిగిందని, ఇతర పార్టీల నాయకులకు అది కన్పించడం లేదా అని ప్రశ్నించారు. మంగళవారం కర్మన్‌ఘాట్ కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఎల్బీనగర్ రింగ్ రోడ్డు, సాగర్ రింగ్ రోడ్డు, నాగోలు చౌరస్తాలలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేదని, ఎస్ఆర్‌డీపీ పాజెక్ట్ కింద రూ.658 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించారన్నారు. పండ్ల మార్కెట్ స్థలంలో 4 టిమ్స్ ఆసుపత్రులను రూ.1200కోట్ల వ్యయంతో 27అంతస్తులతో 1000 పడకల సామర్థ్యంతో ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో రూ.120 కోట్ల వ్యయంతో ఎస్ఎన్‌డీపీ కింద వరద కాలువలు నిర్మించి ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఘనత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిది అని అన్నారు. ఇలా నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి జరిగి వాటి ఫలాలు ప్రజలకు అందుతుంటే ప్రతిపక్షాలు మాత్రం దొంగ ఏడుపులు ఏడ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సుధీర్‌రెడ్డిని ఈసారి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, జీవీ సాగర్ రెడ్డి, చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, భవానీ ప్రవీణ్, పద్మనాయక్, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

సైనికుల కుటుంబాలను సత్కరించటం మన బాధ్యత



పద్మఫాణి ఆచార్య ఇంటి నుంచి కార్గిల్ మట్టిని స్వీకరిస్తున్న కొత్తకాపు రవీందర్‌రెడ్డి, అరుణ

సైదాబాద్: దేశరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి అమరవీరులైన సైనికుల కుటుంబాలను సత్కరించుకోవడం మనందరి బాధ్యత అని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు చేపట్టిన నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం హస్తినాపురంలో దివంగత మేజర్ పద్మఫాణి ఆచార్య ఇంటికి బీజేపీ నాయకులతో కలిసి కార్పొరేటర్ వెళ్లారు. మేజర్ సతీమణి చారులత ఆచార్యకు కార్పొరేటర్ శాలువా కప్పి సత్కరించారు. గతంలో కార్గిల్ నుంచి వారింటికి తీసుకొచ్చిన మట్టిని వారు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్ రెడ్డి, వినయ్, వనజారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

మంగళగౌరికి లక్ష పుష్పార్చన

సైదాబాద్: పవిత్ర శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా శంకేశ్వర బజార్‌లోని శ్రీభవానీ శంకరస్వామి ఆలయంలో కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారిని మంగళగౌరిగా అలంకరించి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, చండీయాగంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధి చిలుకూరు రామిరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ తదితరులు

రజకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నాగోలు: రజకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరే బ్రహ్మయ్య కోరారు. రజకుల సమస్యలపై నాగోలు డివిజన్‌లోని జైపురికాలనీ, ఆనంద్‌నగర్, శివశంకర్‌కాలనీ, సర్వే నంబర్ 58, అయ్యప్ప కాలనీల్లో మంగళవారం బస్తీ బాట నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య రజకులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధోబీ ఘాట్లకు ప్రభుత్వం అందిస్తున్న 250 యూనిట్లు ఉచిత కరెంట్ కొందరికి అందడం లేదని, సంబంధిత అధికారులు కలుగజేసుకొని ఈ పథకం అందరికీ అందేలా చూడాలని కోరారు. తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి వడ్లాల మడేల్, కార్యనిర్వాహక కార్యదర్శి పున్నం రాములు, గ్రేటర్ అధ్యక్షుడ పగడాల లక్ష్మణ్, ఎల్బీనగర్ కార్యదర్శి తిరుపతి, మహిళా అధ్యక్షులు రేణు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో ఓటర్లు పెరిగారు!

- ముసాయిదా జాబితాలో వెల్లడి

ఎల్బీనగర్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎల్బీనగర్ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాను అధికారులు ప్రకటించారు. 45 రోజుల పాటు సాగిన ఓటర్ల నమోదు, తొలగింపుపై అభ్యంతరాలు, మార్పులు చేర్పుల అనంతరం ముసాయిదా జాబితాను విడుదల చేశారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించే ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా సవరణ కూడా చేపట్టారు.బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లినవారి జాబితా, మృతుల పేర్లను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

బూత్‌లు కూడా పెరిగాయి...

ఎల్బీనగర్‌లో గత ఎన్నికల కంటే ఈసారి భారీగా ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. మొదటి ముసాయిదా జాబితా ప్రకారం 11,954 మంది ఓటర్లు పెరగడంతో 25 బూత్‌లను కూడా అధికారులు పెంచారు.



అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..

	గత సంవత్సరం	ఈ సంవత్సరం
మొత్తం ఓటర్లు :	5,34,811	546965
పురుషులు :	2,79,994	2,85,957
మహిళలు :	2,54,676	2,60,660
ఇతరులు :	92	97
సర్వీస్ ఓటర్లు :	49	51
పోలింగ్ కేంద్రాలు :	545	570